క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(దర్గామిట్ట): రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని నెల్లూరులోని ఆయన క్యాంపు కార్యాలయంలో ప్రజాసత్తా సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు పులగర శోభన్‌బాబు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శోభన్‌బాబు రాజకీయాలకు అతీతంగా ప్రజాసత్తా ద్వారా చేపడుతున్న సేవా కార్యక్రమాలను మంత్రికి వివరించారు. ఓటర్లతో ముఖాముఖిలో భాగంగా ప్రతి ఇంటికి ప్రజాసత్తా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కల్లుగీత కార్మికుడికి ఆర్థిక సాయం



నెల్లూరు(వేదాయపాళెం): నెల్లూరు రూరల్ మండలం పెద్దచెరుకూరుకు చెందిన కోసూరు శివయ్యగౌడ్‌కు జిల్లా కల్లుగీత పారిశ్రామికుల సంఘ నేతలు రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని సోమవారం అందజేశారు. ఇటీవల చెట్టు మీద నుంచి కిందపడి గాయపడిన శివయ్యగౌడ్‌కు కోసూరు రాజశేఖర్‌గౌడ్ ఆదేశాల మేరకు సంఘ అధ్యక్షుడు తోట ప్రభాకర్‌గౌడ్ నగదు అందజేశారు. సంఘ నేతలు రామకృష్ణ, రాజాగౌడ్, తాతా సుబ్బారావు, గోవింద్ వంశీ, తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ



నెల్లూరు(అర్బన్): బుజబుజనెల్లూరులోని డీపీఎస్‌ఎం జెడ్పీ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ల్యాప్రోస్కోపిక్ సర్జన్ చైతన్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఏటా పీఎంపీ అసోసియేషన్ నాయకులు విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేయడమే కాకుండా విద్యార్థులు ఒత్తిడికి లోనుకాకుండా మోటివేషన్ తరగతులు నిర్వహించడం అభినందనీయమన్నారు. పీఎంపీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, గౌరవాధ్యక్షుడు అనుమల జయప్రకాష్, రూడ్స్ చైర్మన్ రసూల్, పాఠశాల వ్యవస్థాపకుడు దూడల ప్రసాద్‌రావు, వెంకటనరసయ్య, నాయకులు దేవరకొండ శ్రీనివాసులు, సాయి, శేషయ్య, హెచ్‌ఎం మల్లికార్జునరావు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి ఎంపీ ఆదాల కృషి



నెల్లూరు సిటీ: రూరల్ నియోజకవర్గంలోని ముస్లింల సంక్షేమాభివృద్ధికి ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తున్నారని వైఎస్సార్‌సీపీ ముస్లిం నేతలు పేర్కొన్నారు. 29వ డివిజన్ పెద్దమసీదు వీధిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బారాషహీద్ దర్గా కమిటీ చైర్మన్ షేక్ ఇస్మాయిల్‌ఖాదరి మాట్లాడుతూ ఎంపీ ఆదాలపై టీడీపీ మైనార్టీ నాయకుడు ఎటువంటి ఆధారాలు లేని ఆరోపణలు చేయడం అతని అవివేకానికి నిదర్శనమన్నారు. మరోసారి వాస్తవాలు తెలుసుకోకుండా ఆరోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. మైనార్టీ నాయకులు ఉమర్ ఫారూఖ్, 34 వ డివిజన్ ఇన్‌చార్జి షేక్ రియాజ్, జిల్లా ముస్లిం మైనార్టీ ఉపాధ్యక్షుడు హంషీద్ అలీ, జిల్లా మైనార్టీ సెక్రటరీ నాయబ్‌రసూల్, జిల్లా జనరల్ సెక్రటరీ జాకీర్ హుస్సేన్, స్థానిక నాయకులు ముజీబ్, తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ మాస శుభాకాంక్షలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): పవిత్ర రంజాన్ మాసం ప్రారంభోత్సవం సందర్భంగా నగర నియోజకవర్గ ముస్లింలకు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఎండీ ఖలీల్‌అహ్మద్ సోమవారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ ఉపవాసదీక్షలను భక్తిశ్రద్ధలతో ఆచరించే ముస్లింలందరికీ అల్లాహ్ అనుగ్రహం కలగాలని ఆకాంక్షించారు

రంజాన్ ఉపవాసదీక్షలకు ప్రత్యేక సౌకర్యాలు



రంజాన్ మాస ఏర్పాట్లపై సమీక్షిస్తున్న మేయర్ స్రవంతి జయవర్ధన్, డిప్యూటీ మేయర్ ఖలీల్, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి, కమిషనర్ వికాస్‌మరమ్మత్



హాజరైన ముస్లిం ప్రతినిధులు

• మేయర్ స్రవంతిజయవర్ధన్

నెల్లూరు(బారకాసు): పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని కార్పొరేషన్ పరిధిలోని అన్ని డివిజన్లలో ముస్లింల ఉపవాసదీక్షలకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించాలని నగర మేయర్ పొట్లూరి స్రవంతిజయవర్ధన్ అధికారులకు సూచించారు. కార్పొరేషన్ కార్యాలయ ప్రాంగణంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ సమావేశ మందిరంలో రంజాన్ మాస ఏర్పాట్లపై ముస్లిం మతపెద్దలు, అధికారులతో సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సమావేశంలో కమిషనర్ వికాస్‌మర్మత్, డిప్యూటీ మేయర్ ఖలీల్‌అహ్మద్, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డితో పాటు మేయర్ పాల్గొని ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ముస్లిం ప్రతినిధులు రంజాన్ మాసంలో అన్ని డివిజన్ల పరిధిలో చేపట్టాల్సిన ఏర్పాట్లు, వివిధ సమస్యలు, సలహాలు, సూచనలను మేయర్, కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. మసీదుల పరిసరాల్లో ప్రతిరోజూ పారిశుధ్య చర్యలు చేపట్టాలని, పెద్ద మసీదుల వద్ద షామియానాలు ఏర్పాటు చేసి తాగునీటి వసతి కల్పించాలని కోరారు. మసీదుల పరిసర ప్రాంతాల్లో పందులు, వీధి కుక్కల సంచారాన్ని నియంత్రించాలని, ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. దోమల నివారణకు ఫాగింగ్‌తో పాటు కాలువల్లో ఆయిల్‌బాల్స్ వేయాలని కోరారు. మసీదుల సమీపంలోని వీధి దీపాలకు మరమ్మతులు చేపట్టడంతో పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలన్నారు. కార్పొరేషన్ తాగునీటి సరఫరాను ఉపవాస దీక్షలకు అనుగుణంగా నిర్దేశించిన సమయాల్లోనే విడుదల చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. అవసరమైన ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్పొరేషన్ పరిధిలోని అన్ని విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న ముస్లింలు ఉపవాస దీక్షలు ఆచరించేందుకు నెల రోజుల పాటు ప్రత్యేక వెసులుబాటును కల్పించాలని కోరారు. ఇందుకు మేయర్ సానుకూలంగా స్పందించి తగిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర పండగగా గుర్తింపు పొందిన బారాషహీద్ దర్గా గంధ మహోత్సవాన్ని గతేడాది ప్రతిష్టాత్మకంగా నిర్వహించామని, చక్కటి ప్రణాళికతో రంజాన్ దీక్షలకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, బారాషహీద్ దర్గా కమిటీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, పోలీస్, మైనార్టీ అధికారులు, కార్పొరేషన్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నగరాన్ని ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు కృషి



సింహం ఆకృతిని ప్రారంభిస్తున్న ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

• ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు సిటీ: నగరాన్ని ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని రూరల్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. కార్పొరేషన్ ఆధ్వర్యంలో నగరంలోని ముత్తుకూరురోడ్డు–చిల్డ్రన్స్‌పార్క్ రోడ్డు సెంటర్‌లో రూ.22 లక్షలతో నూతనంగా ట్రాఫిక్ మీడియన్‌ను నిర్మించారు. ఈ ట్రాఫిక్ మీడియాన్‌ను మేయర్ పొట్లూరు స్రవంతి, కమిషనర్ వికాస్‌మర్మత్, కార్పొరేటర్ వేనాటి శ్రీకాంత్‌రెడ్డి, నగర నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, డిప్యూటీ మేయర్ ఖలీల్‌అహ్మద్, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వైవీ రామిరెడ్డి, తదితరులతో కలిసి ఎంపీ ఆదాల సోమవారం ప్రారంభించారు. అనంతరం ఎంపీ మీడియాతో మాట్లాడారు. సింహపురి సింబల్‌గా సింహం ఆకృతిని ఆటో మొబైల్ వేస్ట్‌తో చాలా అందంగా రూపొందించి ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. రెండు,మూడ్రోజుల్లో రూరల్ నియోజకవర్గ పరిధిలోని 19వ డివిజన్, అన్నమయ్య సర్కిల్ సమీపంలోని ఆధునీకరించిన నుడా పార్కును ప్రారంభించనున్నట్లు చెప్పారు. నగరాన్ని పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు కమిషనర్ వికాస్‌మర్మత్ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. కార్పొరేటర్లు బొబ్బల శ్రీనివాస్‌యాదవ్, ఒరిస్సా శ్రీనివాసరెడ్డి, మూలే విజయభాస్కర్‌రెడ్డి, పేనేటి సుధాకర్, మొయిళ్ల గౌరి, రాష్ట్ర ఎంఎస్‌ఎంఈ డైరెక్టర్ పాశం శ్రీనివాస్, ఏఎంసీ వైస్‌చైర్మన్ ఒట్టూరు సుధాకర్‌యాదవ్, ప్రభుత్వాస్పత్రి కోఆర్డినేటర్ కాకుటూరు లక్ష్మీసునంద, జెడ్పీటీసీ మల్లు సుధాకర్‌రెడ్డి, క్లస్టర్ అధ్యక్షులు ముడియాల రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నూతన సాంకేతికతను రైతులకు అందించాలి



శాస్త్రీయ సలహా మండలి సమావేశానికి హాజరైన శాస్త్రవేత్తలు

నెల్లూరు(సెంట్రల్): శాస్త్రవేత్తలు ఎప్పటికప్పుడు నూతన సాంకేతికతను రైతులకు అందించాలని తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం సంచాలకులు డాక్టర్ సి.రమణ సూచించారు. నెల్లూరులోని బీవీ నగర్‌లో ఉన్న కృషి విజ్ఞాన కేంద్రంలో శాస్త్రీయ సలహా మండలి సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ పరిస్థితులపై రైతులకు అవగాహన కల్పించాలని, అన్నదాతలకు రెట్టింపు ఆదాయం వచ్చేలా సూచనలు ఇవ్వాలని తెలిపారు. ప్రధానంగా ప్రభుత్వం రైతుల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన అన్నదాతలు వినియోగించుకునేలా చూడాలన్నారు. సమావేశంలో శాస్త్రవేత్తలు ముకుందరావు, లలితాశివజ్యోతి, శివన్నారాయణ, వినీత, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు అసెంబ్లీ సీటు కేటాయించాలి



నెల్లూరు (టౌన్): జిల్లాలో బీసీలకు ఒక్క అసెంబ్లీ సీటునైనా కేటాయించాలని ఏపీ విద్యార్థి జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదిత్య సాయి టీడీపీని డిమాండ్ చేశారు. ఈ మేరకు మినీబైపాస్‌రోడ్డులోని పూలే విగ్రహం వద్ద సోమవారం ఆయన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ రెండో జాబితాలోనైనా జిల్లాలో బీసీలకు ఒక్క టికెట్‌ను ప్రకటించాలన్నారు. టీడీపీ బీసీ ఓటర్లను వాడుకోవడమే తప్ప నాయకులుగా చూడడం లేదన్నారు. ఎమ్మెల్యే టికెట్ ఇవ్వకపోతే రానున్న ఎన్నికల్లో టీడీపీకి వ్యతిరేకంగా ప్రచారం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు జశ్వంత్, శివ, నాని, తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌కు గాజుక్లాత్ కటింగ్ మెషీన్ వితరణ



మెషీన్‌ను ప్రారంభిస్తున్న జీజీహెచ్ కోఆర్డినేటర్ లక్ష్మీసునంద, సూపరింటెండెంట్ సిద్దానాయక్

నెల్లూరు(అర్బన్): నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి(జీజీహెచ్)కు ప్రభుత్వ మెడికల్ కళాశాల, జీజీహెచ్ అభివృద్ధి కమిటీ కోఆర్డినేటర్ కాకుటూరి లక్ష్మీసునంద గాజుక్లాత్ కటింగ్ మెషీన్‌ను వితరణ చేశారు. తమ సొంత నిధులు రూ.25 వేలు వెచ్చించి ముంబై నుంచి మెషీన్‌ను తీసుకొచ్చి జీజీహెచ్‌కు సూపరింటెండెంట్ సిద్దానాయక్ చేతుల మీదుగా సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీజీహెచ్‌లో ప్రతి నెలా వేలాది మంది రోగులకు ఆపరేషన్లు, ఇతర గాయాలకు కట్లు కట్టేందుకు గాజు క్లాత్‌ను వాడాల్సి ఉందన్నారు. పెద్ద తాన్లుగా వచ్చే గాజు క్లాత్‌ను కట్ చేసేందుకు మెషీన్ లేకపోవడంతో సాధారణ కత్తెరతో కత్తిరించే చేసే క్రమంలో చేతులు బొబ్బలు లేసి సిబ్బంది తీవ్రఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్యను గుర్తించి తమ సొంత నిధులతో కటింగ్ మెషీన్‌ను అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీ డాక్టర్ కళారాణి, ప్రొఫెసర్ నరేంద్ర, డాక్టర్ మస్తాన్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

అభినవ ఘంటసాల పాటూరికి ఉగాది పురస్కారం



నెల్లూరు(బృందావనం): నగరంలోని పురమందిరంలో సంకీర్తన కళాసమితి అధ్యక్షుడు చింతా ప్రసాద్ ఆధ్వర్యంలో ఉగాది పురస్కారాల ప్రదానోత్సవాన్ని ఆదివారం రాత్రి నిర్వహించారు. సీనియర్ గాయకుడు, అభినవ ఘంటసాల బిరుదాంకితుడు పాటూరి శ్రీనివాసులుకు ఉగాది పురస్కారాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు. నెల్లూరు ఆర్డీఓ మలోల ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దశాబ్దాలుగా తన గాన మాధుర్యంతో ఎందరి నుంచో ప్రశంసలు అందుకున్న గాయకుడు పాటూరి శ్రీనివాసులుకు ఉగాది పురస్కారాన్ని అందజేసి సత్కరించడం హర్షణీయమన్నారు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు నిర్మల నరసింహారెడ్డి, సంకీర్తన కళాసమితి గౌరవాధ్యక్షుడు ఏవీఎస్ కృష్ణమోహన్, కనకరాజు, రియాజ్‌బాషా, హైటెక్ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకులకు శిక్షణ

నెల్లూరు (టౌన్): నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో జంతుశాస్త్ర, జీవ సాంకేతిక శాస్త్ర, జీవ రసాయిన శాస్త్ర అధ్యాపకులకు శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ గిరి మాట్లాడుతూ అధ్యాపకులకు ప్రయోగాత్మక నైపుణ్యాలను మెరుగుపరుచుకునేందుకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపల్ రమణారావు, రిసోర్స్‌పర్సన్లు రంజని, ప్రియాంక, గురుశేఖర్ పాల్గొన్నారు.

హోరాహోరీగా క్రికెట్ పోటీలు



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుజబుజనెల్లూరులోని సీఏపీ క్రికెట్ మైదానంలో నిర్వహిస్తున్న ప్రొఫెసర్ టీవీ రమణ మెమోరియల్ టీ–20 క్రికెట్ లీగ్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. సోమవారం జరిగిన తొలి సెమీఫైనల్స్‌లో ఎన్‌యూసీసీ, ఏఎల్‌ఎంసీసీ జట్లు తలపడ్డాయి. తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఎన్‌యూసీసీ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 179 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఏఎల్‌ఎంసీసీ జట్టు 4 వికెట్లు కోల్పోయి 149 పరుగులు మాత్రమే చేసింది. దీంతో ఎన్‌యూసీసీజట్టు 30 పరుగుల తేడాతో విజేతగా నిలిచి ఫైనల్‌కు చేరింది. రెండో సెమీఫైనల్స్‌లో ఎల్‌సీసీ, జీఎస్‌ఆర్‌సీసీ జట్లు తలపడ్డాయి. తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఎల్‌సీసీజట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 162 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన జీఎస్‌ఆర్‌సీసీ జట్టు 139 పరుగులకు ఆలౌట్ అయింది. దీంతో 23 పరుగుల తేడాతో ఎల్‌సీసీ జట్టు విజేతగా నిలిచి ఫైనల్‌కు చేరింది. ఈ నెల 17న ఉదయం 10గంటలకు రెండు జట్లు ఫైనల్స్‌లో తలపడనున్నాయని జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి నిఖిలేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ పోటీలను జిల్లా అధ్యక్షుడు సీవీఎస్ మూర్తి, మాజీ కార్యదర్శి శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

నూతన విద్యుత్ సెక్షన్ కార్యాలయం ప్రారంభం



ఎస్‌ఈ విజయన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏఈ కృష్ణవేణి

నెల్లూ(వీఆర్సీసెంటర్):వెంకటేశ్వరపురంలో నూతన విద్యుత్ సెక్షన్ కార్యాలయాన్ని ఎస్‌ఈ విజయన్ సోమవారం ప్రారంభించారు. నూతన సెక్షన్ కార్యాలయ ఏఈగా బీ కృష్ణవేణి బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఈ మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు నూతన సెక్షన్ కార్యాలయాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. వెంకటేశ్వరపురం, భగత్‌సింగ్‌కాలనీ, జగనన్న హౌసింగ్ కాలనీ, వెంకటేశ్వరపురం వైఎస్సార్ టిడ్కో గృహాలు, అల్లీపురం గాంధీ గిరిజన కాలనీ, అల్లీపురం టిడ్కో గృహ సముదాయాలు నూతన సెక్షన్ పరిధిలోకి వస్తాయన్నారు. నూతన సెక్షన్ కార్యాలయంలో లైన్ ఇన్‌స్పెక్టర్లు 2, లైన్‌మెన్లు 2, అసిస్టెంట్ లైన్‌మెన్లు 5, జూనియర్ లైన్‌మెన్లు 4, జూనియర్ లైన్‌మెన్లు (గ్రేడ్ 2) 4 విధులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఈఈ సోమశేఖర్‌రెడ్డి, కన్‌స్ట్రక్షన్ ఈఈ తనమల శ్రీధర్, డీఈఈ మధుసూదన్‌రెడ్డి, శ్రీధర్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

చేపల, మాంసం మార్కెట్ల వేలం



వేలం పాటలు నిర్వహిస్తున్న అధికారులు

నెల్లూరు(బారకాసు): కార్పొరేషన్ పరిధిలోని చేపల, మాంసం మార్కెట్లకు వేలం పాటలను సోమవారం నిర్వహించారు. కార్పొరేషన్ కార్యాలయంలో రెవెన్యూ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేలం పాటల్లో 30 మంది వరకు పాటదారులు పాల్గొన్నారు. శెట్టిగుంటరోడ్డు, మైపాడు రోడ్డు చేపల మార్కెట్లకు మినహా మిగిలిన మార్కెట్ల కోసం ఒక్కొక్క దానికి ఐదు మంది వరకు పోటీ పడ్డారు. కార్పొరేషన్ పరిధిలో శెట్టిగుంటరోడ్డు, మైపాడురోడ్డు, డైకస్‌రోడ్డులో చేపల మార్కెట్లు, డైకస్‌రోడ్డు పశువుల గంజీఖానా, గొర్రెల గంజీఖానా, సంతపేట పశువుల గంజీఖానా మాంసం మార్కెట్లు ఉన్నాయి. కాగా శెట్టిగుంటరోడ్డు, మైపాడురోడ్డు చేపల మార్కెట్లు మినహా మిగిలిన మార్కెట్లను వేలంలో పలువురు దక్కించుకున్నారు. డైకస్‌రోడ్డు గొర్రెల గంజిఖానాను ఎస్‌కే షఫీ రూ.3.01 లక్షలు డైకస్‌రోడ్డు పశువుల గంజీఖానా ఎస్‌కే మున్వర్ రూ.47వేలు, డైకస్‌రోడ్డు చేపల మార్కెట్‌ను ఏ లక్ష్మి రూ.6.95 లక్షలు, సంతపేట పశువుల గంజీఖానాను చంద్రశేఖర్ రూ.28 వేలకు దక్కించుకున్నారు. శెట్టిగుంటరోడ్డు, మైపాడు రోడ్డు చేపల మార్కెట్ల వేలంలో ఎవరూ పాల్గొన లేదు. చేపల వ్యర్థాలను వేలంలో జే ప్రసాద్ రూ.1.60లక్షలకు దక్కించుకున్నారు. మార్కెట్లను వేలంలో దక్కించుకున్న వారికి ఏడాది పాటు చేపలు, మాంసం విక్రయదారుల నుంచి రోజువారీ నగదు వసూలు చేసుకునే హక్కులు కలిగి ఉంటారని అధికారులు తెలిపారు. రెవెన్యూ విభాగం ఆర్వోలు శ్రీనివాసులు, సమ్మద్, తదితరులు పర్యవేక్షించారు.

తబలిస్ట్‌కు సన్మానం

నెల్లూరు(బృందావనం): అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు వర్ధంతిని పురస్కరించుకుని సుబేదారుపేటలోని ఆంధ్రప్రదేశ్ కళాకారుల సంక్షేమ సంఘ కార్యాలయంలో తబలిస్ట్ మాసుంబాషాను సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు కేతా సుబ్బారావు మాట్లాడుతూ బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన మాసుంబాషా నాలుగు దశాబ్దాలుగా పదివేలకుపైగా కార్యక్రమాల్లో తబల వాద్య సహకారం అందించి ఎందరో ప్రముఖుల ప్రశంసలు పొందారని కొనియాడారు. మధుర గాయకుడు ఘంటసాలను స్మరిస్తూ కళాకారుడు మాసుంబాషాను సముచితంగా సత్కరించి ఘంటసాల చిత్రాన్ని జ్ఞాపికగా అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో శరత్‌చంద్ర, రఘురామిరెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఉదయకళేశ్వరుని హుండీ కానుకల లెక్కింపు

కొడవలూరు: మండలంలోని గండవరంలోని గంగా పార్వతి సమేత ఉదయకళేశ్వరస్వామి బ్రహ్మోత్సవ హుండీ కానులను సోమవారం లెక్కించారు. ఏటా తొమ్మిది రోజులపాటు ఉదయకళేశ్వరునికి అత్యంత వేడుకగా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. తెప్పోత్సవం ముగిసిన మరుసటి రోజు హుండీ కానుకలను లెక్కించడం ఆనవాయితీ. అందులో భాగంగా ఆలయ ప్రాంగణంలో అధికారుల ఆధ్వర్యంలో సోమవారం లెక్కింపు చేపట్టారు. గతేడాది రూ.15.85 లక్షలు ఆదాయం రాగా ఈ ఏడాది రూ.16.07 లక్షలు వచ్చింది. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ చైతన్య, ఈఓలు బండి శాంతయ్య, శ్రీనివాసులు, ఆలయ అర్చకులు బండారు సుబ్రహ్మణ్యం, ఉత్సవ కమిటీ సభ్యుడు రామిరెడ్డి రాజేష్‌రెడ్డి పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ వికాస్‌మర్మత్

నెల్లూరు(బారకాసు): స్పందన అర్జీల పరిష్కారానికి అధికారులు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని నగర కమిషనర్ వికాస్‌మర్మత్ అన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కమిషనర్ పాల్గొన్నారు. నగర ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.అర్జీలను సంబంధిత విభాగాల అధికారులకు అందజేసి నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. స్పందన అర్జీల పరిష్కారంపై ప్రతి శుక్రవారం సమగ్ర నివేదికను అందజేయాలని సెక్షన్ అధికారులకు సూచించారు. కాగా స్పందనకు 30 అర్జీలు అందాయి. పట్టణ ప్రణాళికకు–5, రెవెన్యూకు–3, ఇంజినీరింగ్‌కు–8, హౌసింగ్‌కు–6, పబ్లిక్ హెల్త్‌కు –5, సచివాలయాలకు–3 అర్జీలు అందాయని కమిషనర్ తెలిపారు.

వేల మాటల కన్నా ఆచరణే మిన్న



నందకిషోర్‌కు సత్కారం

నెల్లూరు(బృందావనం): వేల మాటలను ఖర్చు చేయడం కన్నా చక్కని ఆచరణే మిన్న అనే విషయాన్ని శంకర విరచిత ‘వివేకా చూడామణి’ వివరిస్తుందని ప్రముఖ ప్రవచకులు, విశ్రాంత ఆంధ్రోపన్యాసకులు కప్పర గిరిజాలక్ష్మి తెలిపారు. చంద్రశేఖరేంద్ర సరస్వతిస్వామి కంచి కామకోటి పీఠాన్ని అధిరోహించిన సందర్భంగా పొగతోటలోని ఆదిశంకర ధ్యాన మందిరంలో చక్రాల వారి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శంకర విరచిత వివేకా చూడామణి ప్రవచన కార్యక్రమంలో రెండో రోజు సోమవారం ఆమె ప్రవచనం చేశారు. ఆధ్యాత్మిక సాధకుడు అనాత్మను వదలి ఆత్మను పట్టుకోవాలన్నారు. అనాత్మలను వదిలేస్తే బంధ విముక్తి కలుగుతుందన్నారు. ఆత్మను తెలుసుకుని ఆత్మగా ఉండడం, ఆత్మగా జీవించడం జీవికి ప్రధానమన్నారు. దేశమంతా పర్యటించి సన్యాస ఆశ్రమం విధి విధానాలను తెలియజేసిన నడిచే దైవం చంద్రశేఖరేంద్ర సరస్వతిస్వామి అని పేర్కొన్నారు. ఆయన బోధనలు ఎన్నటికీ స్ఫూర్తిదాయకం, ఆచరణీయమని తెలిపారు. అనంతరం విశిష్టఅతిథిగా హాజరైన మూలాపేట శంకరమఠం నిర్వాహకులు కొర్రపాటి నందకిషోర్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో చక్రాలవారి ట్రస్ట్ మేనేజర్ చక్రాల వేంకటలక్ష్మీనరసింహం, శ్రీహరిప్రసాద్‌రావు, సత్యనారాయణ, ఎం లక్ష్మీనరసింహారావు, ఎం ఉదయ్‌కుమార్‌శర్మ, జీ ప్రభాకర్‌శర్మ, మైపాడు రాజా, జీ వరప్రసాద్‌రావు పాల్గొన్నారు.

వైభవంగా పులి వాహనోత్సవం



పులి వాహనంపై మూలస్థానేశ్వరుడు

నెల్లూరు(బృందావనం):మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 9వ రోజు సోమవారం రాత్రి పులి వాహనోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సంప్రదాయంలో భాగంగా ఉదయం ఆదిదంపతులకు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం చప్పరోత్సవాన్ని విశేషంగా నిర్వహించారు. రాత్రి ఆదిదంపతులను విశేషంగా అలంకరించి పులి వాహనంపై కొలువుదీర్చి నగరోత్సవం జరిపారు. చప్పరోత్సవానికి వల్లూరు రాజశేఖర్, ఉమ, దీపక్, సాయిరిషిక, పులి వాహనోత్సవానికి సోమిశెట్టి సుబ్బమ్మ జ్ఞాపకార్థం ధర్మాదాయం నుంచి దేవస్థానం వారు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఆలయ ఈఓ ఆరంబాకం వేణుగోపాల్, ధర్మకర్తల మండలి చైర్మన్ లోకిరెడ్డి వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి సభ్యులు ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు.